


# అభిసారిక

'భరణి'

'మీరు కథలు రాస్తారుటగా?' ఆయన కళ్ళజోడులోనుంచి అడిగాడు. అంత మొఖం సూటిగా అడగడం, నన్ను ఉక్కిరి బిక్కిరిచేసినా, పక్కగా తలుపుగుమ్మంలో నుండి తొంగిచూచే కళ్ళల్లో ఓ విధమయిన గొప్ప కలుగుతుందన్న ఆశతోనే తలూపా.

"ఎందులో ఎందులో రాస్తారేమిటి?"

చెప్పే. అన్నీ చక్కగా వింటూనేవుంది ఆవిడ. సమయానుకూలంగా కళ్ళజోడు వెనకాలవున్నకళ్ళు నావైపు చూస్తున్నపుడు, చూస్తూనే వున్నా.

తలంటుకున్న కబరీభారంలో వేళ్ళాడే మల్లె పువ్వులు, ముత్యాల పేరుల్లాఉంది. కాటిక, తేనెరంగు కళ్ళకి చట్రం కట్టినట్టే వుంది. ఆరుద్రపురుగురంగు జాకెట్టు, ఆకు పచ్చని చీర, ఎంతో సొగసుగావున్న ఆ చూపులు, ఇంకొంచెం సేపు చూడాలన్న కోర్కె కలగటం సహజమే నేమో?

"అయితే డబ్బు లేమయినా ఇస్తారా?"

చెప్పుకోవడం పరువు తక్కువగావున్నా. ఆ కళ్ళకోసం, ముఖ సౌందర్యం కోసం, డాబులుచెప్పే, నాకు తెలుసు ఆవిడకోసం, అబద్ధాలు చెప్పి గొప్పని పూసుకుంటున్నా అని.

మూడు నెలలు నుంచీ ఆవిడ ఏదో సమయంలో తళుక్కుమంటూనేవుంది. చూచినప్పుడల్లా చూడాలని, చూస్తే మాట్లాడాలనీ మాట్లాడితే కాస్త కవ్వించాలనీ, కవ్వించి .... ఏదో చెయ్యాలనీ, కోర్కెలు, ఆశలు అల్లుకునేవి.

'మా కాలేజీలో ఆంధ్రోత్సవాలు చేస్తారటండీ. మంచి నాటకం ఏదైనా రాస్తారా ఏమిటి ....?"

ఆయన దృష్టిలో ఓఅంతస్తు ఎక్కనందుకు గర్వం కలిగింది. ఓసారి కాలరు సవరించుకుని, తలుపువైపు చూచే. రేగిన ముంగురులు సొట్టబుగ్గలలో పడి గిలిగింతలు పెడుతున్నయ్. ఆక్షణంలోవెళ్ళి బుగ్గసొట్టల్ని ముట్టుకోవాలన్నంత ఉధృతం కలిగింది.

"అల్లాగేనండీ ''

ఆయన మెట్లు ఎక్కేడు. పీపు కని పిస్తోంది .... ఖండువా ఆవిడ మెడలో వేస్తూనే.... "శ్రీవారు ....ఇవ్వాళ.... పాండిత్యపు ప్రకర్ష కాబోలు'' అన్నాడు.

''ఛా! వూరుకోండి ....'' వినపడ్డాయి. వెనకాల అడుగుల్లో పాంజేబులు మోగేయి.

'మొన్న భారతిలో ఆయన కథవుందండీ బాగానే రాస్తారు'' ఆయన పొడుంముక్కు చీదుకుని తలుపు వేసుకున్నాడు.

ఆవిడ చదివిందా? .... ఎల్లావుంది? ఇంట్లోకి వచ్చి, ఆపడిన కథే మళ్ళీ చదివి. సమీక్ష చెయ్యడం ప్రారంభించే .... ఆవిడ దృష్టిలో .... ?

*  *  *

వారం రోజులులోనూ, ఆవిడ కనపడి నప్పుడల్లా నవ్వుతూనేవుంది. అది నా నరాలకి నిషా పోస్తున్నట్టేవుంది. నీతి పరులు దృష్టిలో నీచమయి పోతానేమో అన్నదిగ తీత, ఆ కళ్ళల్లో విదగ్ధిపోవాలన్న కోర్కెని చంపేసింది.

అన్నిరోజుల్లోనూ ఆలోచనలు, చరిత్రాత్మకం, సాంఘికం, ప్రణయం ఇల్లాంటి ముఖ్య సంగతుల్లో పరివేషించుకుని, దిగ జారేయి. ఆవిడ దగ్గరగావుంటే, ఏదో యీపాటికిరాని దర్శకత్వం వహించేద్దునన్న ఆశ పీకేది. ఆవిడ ఎల్లా వస్తుంది? ఆ సౌందర్యాన్ని కన్నెత్తి చూడ్డానికయినా హక్కులేదు — నాకు.

ఆయన అన్నాడు "రానేరా?"

'సగం పూర్తిఅయిందండీ' ఆవిడ వింటోందా లేదా అన్న కుతూహలం పీకుతూనే వుంది.

'నేనొకటి ప్రయత్నించే. విందురుగాని రండి''

ఎదురుగా కూర్చున్నపుడు, పక్కగదిలోనుంచి మందారనూనె వాసనవేసింది. గట్టిగా పీల్చే. లోపల అలుముకున్న లతలకి అది మధువులాగేవుంది.

ఆయన చదువుతున్నాడు. 'ఇది చరిత్రాత్మక, ఏకాంక, విషాదాంత నాటిక .... ''

చెవులు ఒప్పగించి ఉరుకున్నా. మనస్సంతా, ఆ లోపల మెట్లుఎక్కి దిగుతున్న గాజుల చప్పుడు వినాలని. కన్పడుతుందా? ఏం చీరకట్టుకుంది అనే. నడక జ్ఞాపకం వాస్తోంది. ఆమె మేడమీద ఉన్నప్పుడు ముంగురులు గాలికి ఇటూ అటూ కదులుతుంటే .... ఎంత అందంగా వుంది మెడవంపు. నా కళ్ళు అందులో దాచుకోవాలని కోర్కె ...

'ఎల్లా వుందండీ ?'

తేరుకున్నా. వినేలేదు. ఇప్పుడు ఏం చెప్పనూ? ఏదో పాత్రపేరు జ్ఞాపకం వచ్చింది. అది చాలా చాలా బావుందని పొగిడే. కళ్ళజోడులోంచి ఆయన బూరుగు కాయ అయ్యేడు.

ఏవో ఎక్సర్‌సైజు పుస్తకాలు ఇస్తూ ''ఇవన్నీ నేను రాశాను. చదివి మీ అభిప్రాయం చెప్పండి'' మెట్లు గాడిద బరువుతోనే దిగే. అంతస్సు దిగులుగానే దిగింది. ఆవిడ కన్పించనే లేదు. సౌందర్యం, కని

విస్తావుంటే హృదయాలకి నొప్పి ఎక్కువగా కల్గుతుంది కాబోలు అనుకున్నా.

ఆ మధ్యాహ్నం 'మీరు రాసిన పుస్తకాలు ఏ మయినా వుంటే ఇమ్మన్నారండీ'' అంటూ పని మనిషి వచ్చింది. పట్టపగ్గాలు లేని ఆనందం కలిగింది. నన్నేనా!

నన్ను గురించి గొప్పగా రాసినవి, నా ఫొటో వున్నవి, బాగా కైపుచేసే కథలన్నీ తీసి ఇచ్చే."ఇవి చదివిం తర్వాత తక్కినవి ఇస్తాను అని చెప్పు" అన్నా. పని మనిషి నన్ను చూచి నవ్వుతోంది. జారిన పమిట లోనుంచి చిన్న నారింజ సౌందర్యం నన్ను సిగ్గు పరచింది.

పావలా లంచం ఇచ్చే. మంచివా రన్నట్టే ముసిగా నవ్వుతూనే, పమిట ఝూడించి, వల్లె వేసుకుంది.

ఆ క్షణంలో వల్లమాలిన తలంపులన్నీ వచ్చేయి. కలలు కూడా నేమో....పనిమనిషి చేత రాత్రి రమ్మన్నట్టు, దగ్గరసావచ్చి, బా వు న్నా నా? అ న్న ట్టు, నెమ్మదిగా రొమ్ముల మధ్య గుండీలులేని ఛాతీ ఆనుకుని కుంకుడుకాయ వాసనల తలంటుతలతో మొఖం, ఒళ్ళూ కప్పుకున్నట్టూనూ ....

కాగితం తీసి కథ రాద్దామనివుంది. దిన దినానికీ సౌందర్యం మారుతూ, యవ్వనపు ఉద్రేకంలో వుండిన, నవోఢ దగ్గరగాఉంటే ఇంకా ఎక్కువ కథలు రాసివుందునేమో అనిపించింది.

పనిమనిషిని అడిగే. ''ఏమన్నారే"అని. నవ్వుతుంది. నా అందం చూడరూ .... అన్నట్టు. చిరిగిన జాకెట్టు కింద ఎత్తు చూస్తూనే నవ్వుతుంది. ఏం చెయ్యనూ?

''మీరు ఎంతో అందంగా వుంటారండీ"

నా పనికోసం నేనూ ఎత్తులు వెయ్యాలి. ఆవిడ ఏమందో చెప్పమంటే, నా అందం గురించి దీని కెందుకూ.... అయినా.

"నువ్వు మాత్రం....?''

నిటారుగా నుంచుని, చెవులవరకూ నవ్వింది. పచ్చబొట్టు బుగ్గమీద, షోడశ కళల్లా నవ్వి, ముడుచుకుంది.

''మేం పనికి వస్తామా ఏమిటి?'' ఎరు పెక్కిన కళ్ళల్లోంచే అంది.

ఇరుకున పడినందుకు కోపం వచ్చింది. దూతిక బెడిసి కొడుతుందేమో అన్న బెంగ. ఏం చెయ్యాలో పాలుపోని శూన్యం.

నవ్వేను. తల నెమ్మదిగా వూపింది రమ్మన్నట్టుగా. బొటనవేలితో వ్రాస్తూనే వుంది. చురుగ్గాచూసి వెనక్కు తిరగబోయే.

నిరాశ నిండుకుండలా. "మీ పుస్తకాలు బావున్నాయట'' అంది. ఇంకా ఏమంది అన్న ఉబలాటంతో క్షణం ఆగే. మాట్లాడ లేదు. ద్వేషం, ఈర్ష్య రెండూ కూర్చు న్నట్టే .... వెళ్ళిపోయే.

ఆయనకి చదివి వినిపిస్తోంది ,రాత్రి ఆవిడ. నేనుకూడా అల్లా చదవలేనేమో; షడ్జమంలోనుంచి గమకం లాగినట్టుగాఉంది.

చదివిందికదా కథలన్నీ; కనీసం ఓ థాంక్స్ అయినా ఇవ్వదా అన్న ఆలోచనలో కొన్ని రోజులు వెళ్ళాయి. ఆయన నాటకాలు, చదవలేక కూర్చునాయి. ఇల్లాంటి ముక్కు పొడుంగాడికి, దొండపండులాంటి పెళ్ళాన్ని కూర్చినందుకు విధిని తిట్టాలని పించింది. ఏరి ఏరి మానవకల్యాణానికి

అంటకట్టటం సౌందర్యానికి రక్షరేఖకాబోలు అనుకున్నా.

ఆవిడతో మాట్లాడాలన్న ఊహలు చంపుకుతిన్నై. ఆయన కాలేజీకి వెళ్లిన తర్వాతే తలుపుతట్టే; ధైర్యం అధైర్యం కూడా ఊగులాడుతుంటే.

"ఎవరూ ?"

అది మాట్లాడ్డమే అనుకుని సమాధానం ఇవ్వనేలేదు. ఇంకోసారి పిలిపించుకుని సంతోషపడాలనే.

'ఎవరూ!' తలుపుగడియ తీసింది. ఎర్రటి బుగ్గమీద, చాపనొక్కులు, అచ్చుపడి. వట్టివేళ్ళల్లా ఉంది,

'మీరా ! రండి.'

'ఆయన నాటకాలు చదివేవనండీ. సాయింత్రం పూళ్ళో వుండనేమో అని....'

నవ్వింది. కుదురుగా ఉన్న పను చిల్లుల్లోంచి ఎర్రటి తాంబూలం కనిపించింది.

"బావున్నాయా ?"

"ఓ .... "

"మీరూ బాగానే రాస్తారే...."గుమ్మానికి ఆనుకున్నా కచ్చేళ్లు సముద్ర కెరటాల్లా, నాలోని ఆశల్లా వున్నాయి. సిగ్గుపడ్డా.

"అంత సిగ్గుపడేవారు, అల్లాంటికథలు ఎల్లా రాయగల్గేరండీ ?"

"సౌందర్యాన్ని చూస్తుంటే ఎన్నైనా రాయ వచ్చునండీ" కనుకొలకుల్లోనుంచి ఎల్లాంటి అర్థం తీసుకుంటుందో అనే చూచే. లోపల నోరుజారినందుకు దిగులుగానేఉంది.

"పెళ్ళయినా కాలేదుగా."

"లోకం గొడ్డుపోయిందంటారాఏమిటి?" రొమ్ములు వైపుచూచే, ఆవిడ చూపులు నా చూపులకి పహరా ఇచ్చి, కువ కువ మన్నాయి..

"అయితే అందంగా వున్నవాళ్ళంతా దిష్టి తీయించుకో వలసిందే" నవ్వుతోంది.

"మీరు .... ?"

'నేనుకూడా తీయించుకో వాలంటారా ఏమిటి ?"

"అందరి కంటె ముఖ్యంగా ...."

'అంత అందంగా వున్నానా ?" అమాయి కత్వానిక నాకే గుండెలు గుబగుబ మన్నాయి. పొగిడే. ఆవిడ వంపుల్లోని తీర్పులన్నీ కదిలేయి. అవి నన్ను ఇరుగ్గా, వెచ్చగా కుర్చీలో కూర్చోబెడుతున్నాయి....

మెట్లు ఎక్కుతున్నట్టేవుంది నా ఆశ. కాఫీకాచి ఇచ్చింది .... వెళ్ళేటప్పుడే "ఎప్పుడైనా ఒస్తూవుండండి కబుర్లు చెప్పడానికి. ఆయన, ఉన్నా లేక పోయినా ఫర్వాలేదు...."

వీధి గుమ్మంచగ్గరకు. మేఘాలమీదేనడచే. ఎదురుగా గిన్నెపట్టుకు వస్తున్న పనిమనిషి, నిప్పులోసుకుంటూ సందులోకి వెళ్ళింది.

కళ్ళల్లోకి చూచి నవ్వుతూనే పెదిమలు తడుపుకుని, గట్టిగా కొరుకుకున్నా, చిరునవ్వు చెవుల్లోవినిపిస్తుంది వెనక.

*  *  *

ఆ రోజుల్లో మా ఇద్దరి పరిచయం పరిహాసా లాడుకునేంతవరకూ వచ్చింది. అందులో వ్యంగ్యంగా నేను సూచించే

అర్ధాలకి ఆవిడ నవ్వుతూనే వుండేది. ఎప్పుడు మాట్లాడినా ఏదోసమయంలో సౌందర్యాన్ని గురించి ప్రస్తావన తెచ్చేది. ఆమెని ఇంకా తెలియని ఆమెతోడి అనుభవాలకోసం నోరు చప్పరించుకుంటూనే, భర్త్రాజునవడంతో కాలంగడిచేది.

అందంగావున్నారు. అని ఆవిడకు నగ్నంగా చెప్పినా, ప్రతివంపునీ పొగడినా, ఆవిడ సిగ్గు పడకుండానే, నవ్వుతూ, గిలిగింతలాగే తీసుకొనేది. ఎరుపెక్కిన శరీరాన్ని చూస్తున్నకొద్దీ, శరీరం మైకం చెంది పరవశ మెత్తేది.

మానవ జీవితంలో, ఆరాధన, అనుభవం, పతనానికి కారణం అయితే దాన్ని నేను యీ సమయంలో, స్వీకరించడానికి కూడా వెనుదియ్యటంలేదు. అనుభవంలేని ఆరాధన నపుంసకుడిగా చేసి కూర్చోపెడుతోంది.

పని మనిషిని, ఏదో సమయంలో చూస్తూనేవున్నా. రోజురోజుకీ అది నా కళ్ళకి మార్పుగా, సొగసుగా కనపడాలని చీరలు మారుస్తోంది. సిగనిండా బొగన్ విల్లియాపూలో, నందివర్ధనాలో, మల్లె మొగ్గలో గుచ్చుకుని, నీలం బొట్టుతో చూస్తుంది. దగ్గరగా వెళ్ళినపుడు చవగ్గా కొన్న పౌడరు, గ్రాడెజ్ టర్కిష్‌బాత్ సబ్బువాసన వేస్తూనేవుంది.

ఆరోజు నన్ను రాసుకుంటూనే అది వెళ్ళింది. ఆ క్షణంలోనే, మాంసం గడ్డ కట్టిన, బిగుతైన రొమ్ములు గుండెల్కి తగిలి, ఆశల్ని ఒక్కక్షణం 'ఖదేరహో' అన్నాయి.... నిలబడ్డ నన్నుచూచి, నవ్వుతుంది అది. చప్పన నీచువాసన తగిలి అసహ్యం వేసినా, శరీరంలో గట్టితనం 'ఒదలకూ' అన్న కోర్కెకి పునాదులు వేస్తోంది.

ఆవిడకూడా ఇల్లాచేస్తే .... ఆ క్షణాన్ని గురించి, ఆ రొమ్ముల్ని వర్ణిస్తూ, భారతం రాసి వుండేవాణ్ణి.

ఆరోజు, వాళ్ళింటికి వెళ్ళే. ఓరవాకిలిగా వేసిన తలుపుతోనే లోపల్కి వెళ్ళే — చొరవగా. ఆమె నవ్వు, ఆమె నడక, పిరుదుల వూపు చూసినప్పుడల్లా, గుండెలు ఆగవు. దాన్ని చూడ్డాన్కి నిప్పున్న కర్ర లాగే. కాలి నుసి అయ్యేవరకూ.

"ఎవరూ ?" వంటింట్లోంచే వచ్చింది. నాకళ్ళు నాకే చాలవేమో ఆమెనుచూడ్డానికి; ఎవరివైనా ఎరువు తెచ్చుకోవాలనిపించింది.

తలకి స్థానంచేసిన తడి, కబరీ భారంలోని పాయలు నదుల్లా వున్నయ్. సరిచూసి పెట్టని బొట్టు, సింహాచలపు కొండమీద దేవుడిలా వుంది. చిన్న ఖండువా వంటి మీద ఉండీ ఉండనట్టువుంది. సన్నని జల్లెడెలో ఆమె ఒళ్ళంతా పీకుతోంది.

జీవితంలో ఆ రొమ్ముల్ని మొఖాన్కి హత్తుకుంటూ తడిజుట్టును ఒళ్ళంతా కప్పుకుని; ఆవిణ్ని, ఓడుతున్న శరీరాన్ని, పిరుదుల్ని ఆవేశంతో కౌగలించుకుని, చచ్చిపోతే చాలు అనిపించింది.

కళ్ళు ఒప్పగించే. మాటల్లేని ప్రతిమలా, ఆవిడ ఒళ్ళు కుంచుకుని నవ్వుతోంది —

చూడమన్నట్టుగా. లేనిసిగ్గుతో. తన ఒళ్ళు తనే చూచుకుని, నావైపు చూస్తోంది.

నా పక్కనుంచి, తగిలీ తగలనట్టే వెళ్ళింది. కురుల్లోంచి రెండు చినుకులు నన్ను పిలిచేయి, శీకాయవాసన ఒళ్ళంతా ఘుమఘుమమని మత్తు పోస్తోంది. "చీర కట్టుకువస్తా కూర్చోండి." అంది.

"చీరా,!' నేను ఏమంటున్నానో తెలియటం లేదు.

మడమమీదే తిరిగి 'ఒద్దూ!' తలూపేనేమో!

అమాయకంగా, ఆపేక్షతో, చంటి పిల్లాడిని లాలించినట్లే నవ్వుతోంది — రతీదేవి అంశలన్నీ తనే స్వంతం చెసుకున్నట్టుగా.

సోఫాలో కూర్చున్నా.

సౌందర్యం తాగుతున్నకొద్దీ పిచ్చెక్కుతోంది. చేతులు నలిపివేయాలన్న కోర్కె గాఢంగా పాతుకుంది. వేడెక్కి శరీరం కాగుతోంది.

నేను ఇరుకునపడ్డం ఆవిడ చూస్తూనే వుంది.

"ఇల్లావుంటే బాగున్నానా?"

"రతీదేవిలా ఉన్నారు. ఎంతకాలం చూచినా చూడాలనే వుంది —" ఆ నవ్వుతూనే తన సౌందర్యాన్ని పొగడించుకుంది, పావు, అర, గంట దాటిపోయిందేమో!

"కాఫీ కాచి ఇస్తా" లేచింది,

"ఒద్దు...." అన్నా.

లోపల్కి వెళుతోంది. ఆ హంసనడక ఎంత పురుషత్వాన్ని ప్రసాదించగలదో అర్థమైంది.

ఆగలేక ఆమె వెనకాలే రెండడుగులు వేశా. నాకళ్లల్లో, చూచిందేమో, నాకోర్కెల్ని నవ్వుతూనే, దగ్గరగా ఒచ్చి బుగ్గమీద చెయ్యి వేస్తూనే.

"ఇప్పుడుకాదు .... అయినా అందాన్ని చూచేరుగా .... దాన్ని నలిపివేస్తారా!" చక్కగా అడిగింది.

రక్తం చచ్చి గడ్డ కడుతోంది. "ఇప్పుడు కాదు ...." అన్నవాక్యం, మనస్సుకు రామనామస్మరణల్లేవుంది.

కాఫీ తాగకుండానే బయిటకివచ్చే.

పనిమనిషి అంటోంది .... "తడిసిన బట్టలు ఆరేయమన్నారా" అని.

* * *

ఆ సాయింత్రం పని మనిషి చీటీ పట్టుకువచ్చింది. ఆవిడ ఇచ్చిందట. పరీక్షకి వెళ్ళే విద్యార్థిలాగే చదివే.

"మా ఇంటికి రావడం మానేసేరు. పిచ్చి ఎత్తినట్టుగావుంది. తప్పక ఇవ్వాళ రాత్రికి రావలసింది" కనీసం ఓ వంద సార్లయినా చదివేను. రాత్రికి తప్పక రావలసింది' అన్నది ఎన్నో మధురానుభవాల్ని నెమరుకు తెస్తోంది.

'రాత్రికి ....' ఆలోచనలు వస్తున్నాయి.

"ఏమని రాసిందండీ చీటీలో" పనిమనిషి ప్రశ్న.

"రమ్మంది" అచేతనంగానే అన్నా. అన్న తర్వాత ఎంత మూర్ఖుడిలా మాట్లాడేనో తెలిసింది. నాలిక కరచుకున్నా.

'అందుకే .... ఒస్తానన్న వాళ్లు మీకు అక్కర్లేదు'' ఈర్ష్యతో అంది. నవ్వు వచ్చింది. ప్రపంచం అంతాకూడా స్త్రీ సమస్యలతో వేగి పోతుందేమో। కావలసిన రత్నాలు దొరక్క దూరమై పోవడం, అక్కర్లేనివి కాళ్ళావేళ్ళా పడ్డం సామాన్య విషయమేనేమో ?

'కోపగించకూ' అన్నా.

'మహా వచ్చేరు' అన్నట్టు చూసి అది వెళ్ళిపోయింది.

చీ క టి ప డి, ఘంటలు జరిగేవరకూ హృదయం కోర్కెలతో రెచ్చిపోయింది. ఆ సన్నటి పంచమినాటి చంద్రుడు, ప్రశాంత యామిని, వేపపువ్వులవాసన ఎంతో ఆహ్లాదంగావుంది —— వాతావరణం.

ఆ ఘంటలు నాలో వెర్రిమోహం కలిగించేయి. తాపం ఎక్కువైంది. ఎట్లా గడపాలి? అన్న ఆవేదనే, ఏమవుతుందో నన్న ఆరాటమే।

పదీ దా టిం త ర్వా త నే బయలుదేరే! సన్నగా ఉడుకులాం వాసన నా చొక్కాల్లోంచి చంపలికిందుగా వస్తున్నా. శరీరంలోని అధికోష్ణం తగ్గనేలేదు.

వీధి తలుపులు గడియవేసివుంది. అంతవరకూ, ఆయన వున్నాడో లేదోకూడా నే ను ఊహించనేలేదు. ఊహించ డానికి సమయం రానేలేదు. తలంపులన్నీ ఆవిడ మీదనే ఉండిపోయినవి.

దొడ్డిదారిని వెళ్ళాలని సందులోపడ్డా. కిటికీదగ్గరగా వెళ్లేటప్పుడే మాటలు వినిపించేయి. గుండెలు ఆగేయి. సన్నగా సందులోంచి వెల్తురు గోడమీద పడుతోంది.

చూచే. ఆయన కళ్ళజోడు లేనికళ్లు చీకిరికళ్లయి దృష్టి సారించాయి. ఆమె చీర మడతలు మూలగా కూర్చున్నాయి....

చూస్తుంటే కోపం వస్తోంది. మల్లెపూలు పక్కమీద నలుగుతున్నై .... మాట్లాడకుండానే .... ఆవిణ్ని కౌగలించుకుని, పక్కమీద దొర్లుతున్నాడు.

ఆవిడ కళ్లు మూసుకుంది, చాచినచేతులు ఆ వి ణ్ని దగ్గరగా లాక్కుని, నలిపేస్తున్నాయి....

"ఏమిటి అంత మోటతనం?''

"మాట్లాడకు"

కటికీ వూచలకు ఆనుకున్న నా శరీరానికి రంపకోతలా వుంది.

''అందాన్ని చూడ్డం చాతకాదు ....ఎప్పుడూ ....'' సగంలో ఆగిన మాటలు ....

"అందం .... ఏడిసింది ...." నోరు మూశాడు ....

దిగజార్పుగా నిట్టూర్పు వినపడింది. తలవంచుకుని, చచ్చిన పాములా సందు దాటే. మనస్సు మండుతోంది. వాడు మృగం అనుకున్నా. తిట్టే .... ఆమెను పొందలేని ఉక్రోషంలో ....

'అబ్బాయి గారూ!"

ఉలిక్కిపడ్డా. గోడ సందునుంచి పనిమనిషి .... సన్నటి గ్లాస్కోచీరె, ఎర్రిటి బొట్టు, మల్లెపూలు .... దగ్గరగా వస్తోంది. దగ్గరగానే ....

"నేను బాగోలేదూ....నచ్చలేదూ!" అంటూనే మెడమీద చేతులు వేసింది. ఒంగిన భారం బలంలోఉన్న రొమ్ముల మీద ఆనుకుంటోంది.

నడిపించే. చచ్చిన కోర్కెలు రేతుగున్నాయి. నూతి అంచుకు లాక్కెవెళ్లా. ఏంచేసినా నవ్వుతోంది .... దగ్గరిగా జరుగుతూ, నల్లబడ్డ పెదిమలలోనుంచి. రాత్రితిన్న చేపల వాసన, ఒంటిమీద నీచువాసన కొత్త కలిగిస్తోంది.

దగ్గారగా....

"ఎంత బావున్నారు" మొఖంనిండా ముద్దులు పెడుతోంది ....

గది చేరేటప్పటికి కోడికూసింది, శూన్యంలో నడిచేనేమో! కోర్కెలు, ఆశలు చచ్చి నీరసపడుతున్నాయి ....

తనకిలేని పొగడ్త, ఇంకోచోట సంపాదించుకుని, భర్తతో ఆరాత్రిళ్లు కాపురం చేస్తోందా? లేనికోర్కెలు .... నేను ఎంత పిచ్చివాణ్ణయ్యేనో అనిపించింది. నరాల్లోంచి ....

ఆయన "నాటకం రాశారా!" అడుగుతాడు .... ఏం చెప్పనూ! ఆవిడ కనిపించినప్పుడల్లా తల వంచుకుని చూడకుండానే అడుగులు వేస్తున్నా కాని ఆ చూపుల్లో, ఏదో దీనత్వం, ఆక్రోదన, లేక పోలేదు. మునుపటిలా ఆవిడ నవ్వటంలేదు అని తట్టింది.

రోజులుమాత్రం జరుగుతూనేవున్నై।

★

